క్లుప్తంగా

'స్వర్ణగిరి' కథల పుస్తకం ఆవిష్కరణ



చిప్పగిరిలో పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పుల్లా రామాంజనేయులు రచించిన స్వర్ణగిరి కథల పుస్తకం పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు రంగనాథ్ చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. సాహితీవేత్తలు మాట్లాడుతూ.. పుస్తకంలోని 18 కథలు పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో రాశారని ప్రశంసించారు. రచయత పుల్లా రామాంజనేయులను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.

బ్రహ్మగుండం ఆదాయం లెక్కింపు



హుండీల ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

వెల్దుర్తి: ప్రముఖ శైవక్షేత్రం బ్రహ్మగుండంలో నాలుగు రోజుల పాటు జరిగిన శివరాత్రి ఉత్సవాల ద్వారా సమకూరిన ఆదాయం లెక్కింపును మంగళవారం ఆలయ ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల తాత్కాలిక హుండీ కానుకల ద్వారా రూ.1,01,461, సేవా టికెట్ల ద్వారా రూ.87,161, తాత్కాలిక అంగళ్ల ద్వారా రూ.67,990 కలుపుకుని రూ.2,56,612 సమకూరినట్లు ఈఓ తెలిపారు. ఆలయ సిబ్బంది మద్దిలేటి, రమణ, వెంకటేశ్, అర్చకులు, ఆయకట్టుదారులు పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన



ముక్కెల్ల చెరువును పరిశీలిస్తున్న మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డి

తుగ్గలి: హంద్రీ–నీవా రిజర్వాయర్ ద్వారా చెరువులకు నీళ్లు మళ్లించే పైపులైన్ పనులను మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖరరెడ్డి పరిశీలించారు. మంగళవారం ముక్కెల్ల, రాంపల్లి చెరువులను ఆయన పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. జిల్లాలో 68 చెరువులకు రిజర్వాయర్ నీటిని మళ్లించేందుకు ప్రభుత్వం పనులను వేగవంతం చేసిందన్నారు. ఇప్పటికే బొందిమడుగుల చెరువుకు నీటి విడుదల ట్రైల్ రన్ పూర్తయ్యిందన్నారు. పైపులైన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎస్ఈ వెంట ఈఈ నారాయణరెడ్డి, డీఈ రామకృష్ణ, ఏఈ రియాజ్ ఉన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



అష్టావధానం చేస్తున్న భరత్‌శర్మ

తుగ్గలి: మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం జొన్నగిరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అష్టావధాన కార్యక్రమంలో అవధాని తిరుపతి ఉప్పలధడియం భరత్‌శర్మ పృచ్ఛకుల ప్రశ్నలకు అవలీలగా సమాధానం చెప్పారు. భరత్‌శర్మకు మంచి భవిష్యత్తు ఉందని పృచ్ఛకవర్గం సభ్యులు అన్నారు. అనంతరం అవధానిని హెచ్‌ఎం సునీల్‌రాజ్, ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మాచాని సోమప్ప స్కూల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా పట్టణంలోని పోలింగ్ కేంద్రాలను ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. మాచాని సోమప్ప ఇంగ్లిష్ మీడియం స్కూల్, వీవర్స్ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్, మాచాని సోమప్ప ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. తహశీల్దార్ జయన్న, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ రవీంద్రనాథ్ రెడ్డి, సర్వేయర్ అశోక్ తదితరులు ఉన్నారు.

పంట నమోదుతో సకల ప్రయోజనాలు

- నియోజకవర్గంలో 78 శాతం నమోదు
- ఈ నెల 25 వరకు అవకాశం

పత్తికొండటౌన్: సాగు ప్రయోజనాలను రైతులకు సక్రమంగా అందించేందుకు ప్రభుత్వం ఈ–క్రాప్ విధానాన్ని అమలుచేస్తోంది. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారు. గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తోంది. రైతులు పండించిన దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పిస్తోంది. కరువు, అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయినప్పుడు పరిహారం అందిస్తోంది. రైతులకు ఈ ప్రయోజనాలు అందాలంటే ఈ–క్రాప్ నమోదు చేయించుకోవడం తప్పనిసరి.

ఈ–క్రాప్ నమోదు ఇలా..

వ్యవసాయశాఖ సిబ్బంది ఈ–కర్షక్ యాప్‌లో రైతుల వివరాలు, పంటలసాగు వివరాలను నమోదు చేస్తారు. మొదట రైతు భరోసా కేంద్రాలలో రైతుల వివరాల నమోదు, క్షేత్రస్థాయిలో పంటల నమోదు, చివరగా ప్రతి రైతుతో ఈ–కేవైసీ నమోదు చేయించాలి.



తుగ్గలి మండలం లక్ష్మీతండాలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

మండలాల వారీగా ఈ-కేవైసీ నమోదు శాతం

మండలం	రైతులు	సాగు విస్తీర్ణం (ఎకరాలు)	ఈ–కేవైసీ (ఎకరాలు)	నమోదు శాతం
పత్తికొండ	2,989	12,090	10,381	85
తుగ్గలి	2,959	9,017	6,898	76.5
వెల్దుర్తి	2,843	6,397	5,918	92.5
మద్దికెర	5,100	21,465	16,096	74
క్రిష్ణగిరి	1,904	8,472	5,878	73
మొత్తం	15,795	57,441	45,171	78.63

రైతులు నమోదు చేయించుకోవాలి



పంటల నమోదు ప్రక్రియ వంద శాతం పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాం. వ్యవసాయ శాఖ సిబ్బంది పొలాల వద్దకే వెళ్లి నమోదు చేస్తున్నారు. రైతులందరూ ఈనెల 25వ తేదీలోగా ఈ–క్రాప్‌తో పాటు, ఈ–కేవైసీతో పాటు ఆధార్ అనుసంధానం చేయించుకోవాలి. – విజయకుమార్, ఏడీఏ, పత్తికొండ

ఈ–క్రాప్ నమోదుతో లబ్ధి

ఈ–క్రాప్ నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందుతాయి. ఇన్‌పుట్ సబ్సిడీ పెట్టుబడి సాయం, పంటలబీమా, పంట నష్టపరిహారం, పంటల గిట్టుబాటు ధర, ఎరువులు, పురుగు మందులు వంటివి రాయితీపై అందుతాయి. పంట నమోదు చేయించుకున్న రైతులు ఈ–కేవైసీ కూడా చేయించుకోవాలి

నియోజకవర్గంలో పంట నమోదు వివరాలు

పత్తికొండ నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఈ ఏడాది రబీ సీజన్‌లో 15,795 మంది రైతులు దాదాపుగా 57 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగుచేశారు. రైతులు ప్రధానంగా పప్పుశనగ, వేరుశనగ, వాము, జొన్న, ఉల్లితో పాటు కూరగాయలు సాగుచేస్తున్నారు.

నియోజకవర్గంలో వ్యవసాయశాఖ సిబ్బంది 78.63 శాతం ఈ–క్రాప్ నమోదుతో పాటు, ఈ–కైవేసీ పూర్తిచేశారు. ఈనెల 25 వరకు అన్ని గ్రామాల్లో ఈ–క్రాప్‌తో పాటు ఈకేవైసీ నమోదు ప్రక్రియ కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

తుగ్గలి: మండల పరిధిలోని మారెళ్ల, పి.కొత్తూరులో సుంకులమ్మ, మారెమ్మ, సుగాలి నాగమ్మ గ్రామ దేవతల దేవర ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి గ్రామస్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంధుమిత్రుల రాకతో ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. బుధవారం అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారని గ్రామ పెద్దలు తెలిపారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

కృష్ణగిరి: మండల కేంద్రంలో వెలసిన దస్తగిరయ్య స్వామి ఉరుసు సందర్భంగా బుధవారం నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు గ్రామస్తులు మంగళవారం తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు వరుసగా రూ.20 వేలు, రూ.10 వేల నగదు బహుమతులను దాతల సహకారంతో అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల జట్లు ఉదయం 9 గంటల్లోపు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలలని సూచించారు. వివరాలకు 84660 55415, 80741 40228 నంబర్లను సంప్రదించాలన్నారు.

హోరెత్తిన రైతు సంబరం



విజేతకు నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు



బిణిగేరిలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న గుమ్మనూరు శ్రీనివాసులు

వెల్దుర్తి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బ్రహ్మగుండంలో ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్ కేటగిరీ వృషభాల అంతర్ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలతో రైతు సంబరం హోరెత్తింది. విశేషంగా తరలివచ్చిన రైతుల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో అనంతపురం జిల్లా గార్లదిన్నె రామాంజనేయులు వృషభాలు విజేతగా నిలిచి రూ.50 వేల బహుమతిని దక్కించుకున్నాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మన రవిరెడ్డి ప్రారంభించారు. తరువాతి స్థానాలలో వరుసగా నంద్యాల జిల్లా డోన్, కొత్తకోట రామ్మోహన్ వృషభాలు, బేతంచెర్ల మేకల వెంకట్రాముడు వృషభాలు, నంద్యాల యాడికి చెన్నప్ప వృషభాలు, వెల్దుర్తి మండలం రత్నపల్లె ఈశ్వరయ్య వృషభాలు నిలిచాయి. ముఖ్య అతిథి కంగాటి రామ్మోహన్, మండల కన్వీనర్, చైర్మన్, ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సుంకన్న, బుక్కాపురం శంకర్‌రెడ్డితో కలిసి విజేతలకు రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ10 వేలు మరో రూ.10 వేల కన్సోలేషన్ బహుమతులు, కామేశ్వరీదేవి సమేత బ్రహ్మేశ్వరస్వామి వార్ల ఫొటోలతో కూడిన మొమెంటోలను అందించారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నందవరం: మహా శివరాత్రి పురస్కరించుకుని గురజాల గ్రామంలో మంగళవారం ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. తెలంగాణలోని గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు భాస్కర్ రెడ్డి వృషభాలు విజేతగా నిలిచి రూ.40 వేలు గెలుపొందాయి. రెండో స్థానాల్లో నిలిచిన ఎమ్మిగనూరు మండలం గుడేకల్ సుధాకర్ రెడ్డి వృషభాలు రూ.30 వేలు, మూడో స్థానంలో తెలంగాణ గద్వాల జిల్లా అయిజ మండలం దేవబండ గ్రామం దాసు వృషభాలు గెలుపొంది రూ.10 వేలు దక్కించుకున్నాయి.

ఆస్పరి: బిణిగేరిలో శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు స్వామి ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను దేవరగట్టు ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు, చిప్పగిరి జడ్పీటీసీ విరుపాక్షి ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 15 జతలు వృషభాలు పాల్గొన్నాయి. గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి లక్ష్మన్న వృషభాలు విజేతగా నిలిచాయి. తరువాతి స్థానాల్లో కర్నూలు శివకోటి వృషభాలు, చిననెలటూరు జి.కుమారస్వామి వృషభాలు, అనంతపురం తోట తిరుపాలరెడ్డి వృషభాలు, అనంతపురం జిల్లా తానాల గుండం శివారెడ్డి వృషభాలు, పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గంగోశి చంద్ర వృషభాలు గెలుపొందాయి. వృషభాల యజమానులకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ. 10 వేలు, రూ.8 వేలు నగదు బహుమతులు, పోటీల్లో పాల్గొన్న మిగతా వృషభాల యజమానులకు ఒక్కొక్కరికి రూ.4 వేలు, ఉత్తమ రథసారథిగా ఎంపికైన పుచ్చకాయలమాడ వెంకటేష్‌కు రూ.2వేలు అందజేశారు.

బహుమతుల ప్రదానం



హోసూరు జట్టుకు బహుమతి అందజేస్తున్న శ్రీనివాసులు స్వామి

ఆస్పరి: మండలంలోని బిణిగేరి గ్రామంలో వెలసిన శ్రీగిరి పంచలింగేశ్వర స్వామి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా ఆదోని మండలం ఊనూరు నిలిచింది. పోటీల్లో మొత్తం 35 జట్లు పాల్గొనగా ఊనూరు, శంకరబండ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా జరిగింది. మంగళవారం విజేత ఊనూరు జట్టుకు రూ.12 వేలు, రన్నరప్ శంకరబండకు రూ.8 వేలు, తరువాతి స్థానాల్లో నిలిచిన తెర్నేకల్లుకు రూ.5 వేలు, నాలుగవ విజేతకు రూ.3 వేలను పంచలింగేశ్వర స్వామి ఆలయ నిర్వాహకులు శ్రీనివాసుల స్వామి అందజేశారు. సర్పంచ్ వెంకటేష్, ఆస్పరి సొసైటీ సీఈఓ అశోక్, గ్రామ పెద్దలు చిన్నరెడ్డి, వెంకటేషులు, సోమన్న, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

నందవరం: రామలింగేశ్వర స్వామి జాతర పురస్కరించుకుని గురజాలలో నిర్వహించిన కబడ్డీ టోర్నీలో 28 జట్లు పాల్గొన్నాయి. విజేత గోనెగండ్ల మండలం అయ్యకొండ జట్టుకు రూ.30,016, రన్నర్ కర్నూలు స్టేడియం జట్టుకు రూ.20,016, మూడో స్థానంలోని కోడుమూరు మండలం వర్కూరు జట్టుకు రూ.10,016, నాల్గవ స్థానంలో నిలిచిన సొసైటీ నాగలదిన్నె జట్టుకు రూ.5,016 చొప్పున నగదు బహుతులను నిర్వాహకులు మంగళవారం అందజేశారు. దాతలు గురజాల ఎంప్లాయిస్ యూత్, సురేంద్రరెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సర్పంచ్ వీరస్వామి పాల్గొన్నారు.

స్కిల్ హబ్ కేంద్రం ఏర్పాటు

ఎమ్మిగనూరుటౌన్: యువతలో నైపుణ్యాలను మెరుగుపరచాలనే ఉద్దేశంతో స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు స్కిల్ హబ్ ఇన్‌చార్జ్ సుధాకర్‌బాబు మంగళవారం తెలిపారు. ఇందులో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ప్రీ అసెస్‌మెంట్ టెస్ట్ నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

చిన్నోడికి పెద్ద కష్టం

- అప్లాస్టిక్ అనీమియాతో మృత్యువుతో పోరాటం
- బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలన్న వైద్యులు
- ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు



అచేతనంగా పడిఉన్న చిన్నారి జశ్వంత్‌కుమార్

పత్తికొండ రూరల్: రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబంలో కొడుకు పుట్టాడన్న ఆనందం ఎన్నాళ్లో నిలువలేదు. రెండో ప్రసవం సమయంలోనే తల్లీ, బిడ్డ మృతి చెందడంతో మెదటి కుమారుడు తల్లి ప్రేమకు దూరమయ్యాడు. ఆ బాలుడిని ప్రాణాంతకమైన అప్లాస్టిక్ అనీమియా కబలించడంతో రోజురోజుకు నిస్సత్తువ ఆవహించి నీరసించిపోతున్నాడు. మృత్యువుతో పోరాడుతున్న బిడ్డను బతికించుకునేందుకు పేదరికం తండ్రికి అడ్డంకిగా మారింది. దయగల మారాజులెవరైనా ఆపన్న హస్తంతో తన బిడ్డకు ప్రాణం పోస్తారేమోనని ఎదురుచూస్తున్నారు.

పత్తికొండ మండలం చందోలి గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మన్న, వెంకటలక్ష్మి దంపతులకు జశ్వంత్‌కుమార్ సంతానం. కూలి పని చేసుకుని జీవించే ఆ కుటుంబంపై విధి చిన్నచూపు చేసింది. రెండో కాన్పు సమయంలో తల్లీ, బిడ్డ మృతి చెందారు. ఏడాది వయసులోనే తల్లి ప్రేమకు దూరమైన జశ్వంత్‌ను తండ్రి లక్ష్మన్న అన్నీ తానై చూసుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలో ఆరు నెలల కిందట నుంచి రోజురోజుకు నీరసించిపోతుండటంతో విశ్వభారతి, కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో చూపించారు. రక్తహీనతను గుర్తించిన వైద్యులు నాలుగు దఫాలుగా 12 బాటిళ్లు 'ఓ' పాజిటివ్ గ్రూపు రక్తం ఎక్కించారు. అయినా రక్తవృద్ధి లేకపోవడంతో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జీ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా అప్లాస్టిక్ అనీమియా, ఎముక మూలుగులోనే సమస్య ఉన్నట్లుగా గుర్తించారు. ఇందుకు బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆపరేషన్ చేస్తే చిన్నారి కోలుకుంటాడని, రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. బతుకు దెరువే కష్టంగా ఉన్న వారికి అంత ఖరీదైన వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక రోజురోజుకూ సచ్చుబతిపోతూ క్షీణిస్తున్న కొడుకును చూసి కుమిలిపోతున్నాడు. చిన్నారి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పడిపోయి ప్లేట్‌లెట్స్ సంఖ్య క్రమేపీ తగ్గుతూ బాలుడిని నిస్సత్తువ ఆవహించింది. మృత్యువుతో పోరాడుతున్న తన బిడ్డను బతికించేందుకు దయగల మారాజులెవరైనా చేయూతనందిస్తారేమోనని ఆ తండ్రి దీనస్థితితో ఎదురుచూస్తున్నాడు.

దాతలు సాయమందించేందుకు వివరాలు

ఏపీజీబీ, పత్తికొండ బ్రాంచ్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : ఏపీజీబీ 0003081,
అకౌంట్ నంబర్ : 19053620569,
సంప్రదించాల్సిన సెల్ నంబర్లు 73963 94008, 81062 08481

పౌష్టికాహార లోపం నివారించాలి



కోటవీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మారుతి

ఆలూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్న పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ మారుతి ఏఎన్ఎంలు, ఆశావర్కర్లకు సూచించారు. మంగళవారం ఆయన కోట వీధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పిల్లల బరువు పరీక్షించి రక్తహీనత తదితర పరీక్షలు చేశారు. బలహీనమైన బాలబాలికలు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తల్లిదండ్రులకు సూచించారు. అవసరమైన వారికి ఐరన్ ట్యాబ్లెట్లు పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మద్దికెర: సకాలంలో విధులకు హాజరు కావాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఈఓ శ్రీహరి హెచ్చరించారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సహకరించినప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. గ్రామంలో ఇంటి పన్ను, కొళాయి పన్నులు వసూలు చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అలాగే ప్రజలు ఎక్కడైనా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే వెంటనే పంచాయతీ ఆఫీసులో తెలియజేయాలన్నారు. అనుమతి పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. నీటిని వృథా కాకుండా చూడాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ఎక్కడైనా బోర్లు చెడిపోతే వెంటనే మరమ్మత్తు చేయించి నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

24న విగ్రహ ప్రతిష్ఠ

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామంలోని భద్రకాళి ఆలయంలో ఈ నెల 24న నూతన విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు గ్రామ పెద్దలు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భద్రకాళి దేవి విగ్రహ ప్రతిష్ఠతో పాటు గణపతి, సంతాన నాగేంద్ర స్వామి, దుర్గామాత పాద ప్రతిష్ఠ, నూతన గోపుర కలశ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఓటరు నమోదుకు 23 వరకు గడువు

మద్దికెర: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటరుగా నమోదు చేసుకోడానికి ఈ నెల 23వ తేదీ వరకు గడువు విధించినట్లు తహసీల్దార్ నాగరాజు మంగళవారం తెలిపారు. ఇప్పటికే పట్టభద్రులైన మహిళలు 179 మంది, పురుషులు 589 మంది మొత్తం 768 మంది నమోదు చేసుకున్నారన్నారు. అలాగే ఉపాధ్యాయులు 49 మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. అర్హులైన వారు ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రామలింగేశ్వరుడి వసంతోత్సవం



నది నుంచి ఊరేగింపుగా వస్తున్న దృశ్యం

నందవరం: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురజాల రామలింగేశ్వరుడి క్షేత్రంలో వసంతోత్సవం నిర్వహించారు. ఉదయం రామలింగేశ్వరుడికి ఆలయ అర్చకులు హంపేష్‌స్వామి నేతృత్వంలో అభిషేకాది పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులు శివ పార్వతులను భక్తులు నెత్తిన కొలువు చేసుకుని వసంతోత్సవం ఆడారు. రంగులు చల్లుకుంటూ చన్నీటి పులకింతలతో నందికోళ్ల సేవ మధ్య శోభాయమానంగా వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం పవిత్ర తుంగభద్ర నదిలో ఉత్సవమూర్తులకు సంప్రదాయ స్నానాలు గావించి ఊరేగింపు జరిపారు. ఆలయ ఈఓ దినేష్, ట్రస్టు బోర్డు చైర్మన్ నరసింహులు, గ్రామ సర్పంచ్ వీరస్వామి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి

గోనెగండ్ల: పదో తరగతి విద్యార్థులు క్రమశిక్షణతో చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంఈఓ వినోద్ కుమార్ సూచించారు. వారు మంగళవారం మండలంలోని హెచ్. కైరవాడి జెడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి మార్కులు వస్తాయన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు అర్థం కాకుంటే మరో సారి అడిగి తెలుసుకోవాలని సూచించారు. అపోహ లు పెట్టుకోకుండా కొంచెం కష్టపడితే అన్ని సబ్జెక్టులు సులువుగానే ఉంటాయన్నారు. ఈ సంవత్సరం పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈఓఆర్డీ నాగేష్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీఓ తనిఖీలు

కృష్ణగిరి: ప్రభుత్వ సేవల నిమిత్తం అద్దెకు నడుపుతున్న ప్రైవేట్ వాహనాలకు అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని డోన్ ఆర్టీఓ క్రాంతికుమార్ అన్నారు. అమకతాడు టోల్‌ప్లాజా వద్ద మంగళవారం సాయంత్రం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో.. మైసూర్ నుంచి నాగపూర్‌కు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నగదుతో సీఐఎస్ఎఫ్ సెక్యూరిటీగా వెళ్తున్న రెండు కంటైనర్ వాహనాలకు ట్యాక్స్ పర్మిట్లు లేనట్లు గుర్తించారు. ఆ వాహనాలకు రూ.30,740 జరిమానా విధించారు. నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హొళగుంద: కర్ణాటక నుంచి ఆంధ్రాకు అక్రమంగా తరలిస్తున్న మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్‌జహీర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. హొళగుందకు చెందిన బసవరాజుతో పాటు మరో ఇద్దరు 96 మద్యం టెట్రా ప్యాకెట్లను కర్ణాటక నుంచి తీసుకొస్తుండగా ఎల్లెల్సీ వద్ద పట్టుకున్నట్లు వెల్లడించారు. నిందితులను అరెస్ట్ చేసి మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

బీమా తక్షణ సాయం అందజేత

హొళగుంద: మండల కేంద్రానికి చెందిన దిడ్డి మల్లయ్య మంగళవారం అనారోగ్యంతో మరణించాడు. అతని పేరిట వైఎస్సార్ బీమా నామినీగా ఉన్న భార్య దిడ్డి మల్లేశ్వరికి పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కుమారస్వామి, పంపాపతి, మల్లయ్య చేతుల మీదుగా తక్షణ సాయం రూ.10 వేల నగదు అందజేశారు. త్వరలో మిగతా సొమ్ము నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని వారు తెలిపారు.

బాలుడి మృతిపై కేసు నమోదు

కృష్ణగిరి: చిట్యాల గ్రామంలో సోమవారం ఉప్పరి సూర్య (5) బావిలో పడి మృతి చెందిన ఘటనపై తండ్రి ఉప్పరి శేషన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అలాగే డోన్ సీడీపీఓ శంషాద్‌బేగం గ్రామంలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రం-2 కార్యకర్త సావిత్రితో మాట్లాడారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రం నుంచి మధ్యాహ్నం 1 గంటకు ఎందుకు పంపారని ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన కార్యకర్తకు షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు చెప్పారు.

ఉత్సవాలు విజయవంతం

వెల్దుర్తి: బ్రహ్మగుండం క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఆఖరి రోజు మంగళవారం కామేశ్వరీ దేవి సమేత బ్రహ్మేశ్వరుడు సర్వాభరణాల ప్రత్యేకాలంకరణలో దర్శనమిచ్చాడు. వసంతోత్సవంలో భాగంగా గంగా,గౌరీ సమేత బ్రహ్మేశ్వరుడి ఉత్సవమూర్తులను భక్తులు, ఆయకట్టుదారులు, అర్చకులు ఒంటెద్దు బండిపై ఉంచి మేళతాళాల మధ్య ఆలయ ప్రాకారం చుట్టు తిప్పుతూ రంగులు చల్లుకున్నారు. సాయంత్రం వెల్దుర్తి పట్టణ పురవీధుల్లో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం చేసిన ప్రతిఒక్కరికీ ఈఓ, చైర్మన్ ధన్యవాదాలు తెలిపారు.

గంజాయి సాగుపై విచారణ

కృష్ణగిరి: మండల పరిధిలోని పెనుమాడ గ్రామంలో ఓ రైతు పొలంలో గంజాయి సాగు చేసినట్లు సమాచారం రావడంతో మంగళవారం సాయంత్రం కర్నూలు త్రీటౌన్ సీఐ తబ్రేజ్‌తోపాటు వెల్దుర్తి సీఐ యుగంధర్, కృష్ణగిరి పోలీసులు తనిఖీలు చేపట్టారు. బుధవారం మరోమారు పొలాన్ని పరిశీలించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని వారు తెలియజేశారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ఆలూరు రూరల్: ఉగాది నాటికి జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అన్ని మండలాల హౌసింగ్ ఏఈలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆలూరు హౌసింగ్ డీఈ ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆలూరు మండలంలో 247 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా టార్గెట్ ఉండగా.. ఇప్పటివరకు 107 గృహాలు పూర్తయ్యాయన్నారు. ఆస్పరి మండలంలో 290కు గాను 176, చిప్పగిరిలో 225కు గాను 120, దేవనకొండ మండలంలో 733కు 398, హాలహర్విలో 178కు 88 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశామన్నారు. అలాగే హొళగుంద మండలంలో 244 ఇళ్లు నిర్మించాల్సి ఉండగా.. ఇప్పటివరకు 139 గృహాలు పూర్తిస్థాయిలో నిర్మించుకున్నట్లు చెప్పారు. మిగిలిన గృహాలన్నీ వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని చెప్పారు. ఉగాది నాటికి అన్ని గృహ నిర్మాణాలు పూర్తి చేసి ప్రవేశాలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య

ఎమ్మిగనూరు రూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో చాకలి అశోక్ (27) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి శేకన్న, నరసమ్మల కుమారుడు అశోక్ గుంతకల్‌లో ఐటీఐ చదువుతున్నాడు. బతుకుదెరువు కోసం శేకన్న, నరసమ్మ ఇటీవల బెంగళూరుకు వలస వెళ్లారు. అశోక్ వారం రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తర్వాత ఏం జరిగిందో తెలియదు గానీ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో కాలనీ వాసులు తలుపులు తెరిచి చూడగా అశోక్ ఫ్యాన్‌కు వేలాడుతూ శవమై కనిపించాడు. శరీరం ఉబ్బిపోయి, పురుగులు పట్టి ఉండటంతో కాలనీ వాసులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు హుటాహుటిన గ్రామానికి చేరుకుని అంత్యక్రియలు నిర్వహించారు. ఆత్మహత్య ఘటన తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేస్తున్నామని రూరల్ ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఇమాంఖాశీం స్వామి ఉరుసు

కృష్ణగిరి: మండల పరిధిలోని పోతుగల్లు గ్రామంలో వెలసిన భక్తుల ఆరాధ్య దైవం ఇమాంఖాశీం స్వామి ఉరుసును మంగళవారం గ్రామస్తులు వైభవంగా జరుపుకున్నారు. హిందు, ముస్లింలు గ్రామంలోని దర్గాకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. బుధవారం కిస్తీ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు చేశారు. అలాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

హొళగుంద: మండల పరిధిలోని మార్లమడికి గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నాడు–నేడు కింద రూ.32 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి మంగళవారం భూమిపూజ జరిగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, పీఎంసీ చైర్మన్ చంద్రశేఖర్, మోహన్‌రాజు, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొని పూజ చేశారు. ఈ నిధులతో పాఠశాలకు అదనపు గదులు, ప్రహరీ, టాయిలెట్లు, సంప్ ఇతర మేజర్, మైనర్ మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. హెచ్‌ఎం పరమేష్, నాగరాజు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.